శ్రీ దుస్సా కృష్ణారావు

# ప్రేమ పరివర్తనం

"సోదర సోదరీమణులారా! మీ యీగ్రామ రామంగారివంటి యువకులంతా కలిసి గ్రామ సేవాసంఘాన్ని స్థాపిస్తున్నందుకు యెంతైనా సంతోషం గలుగుతోంది. నిజంగా ప్రస్తుతసమయంలో ప్రతి పల్లెటూరిలోనూ, గ్రామంలోనూ యిలాంటి సేవాసంఘాలు స్థాపించబడడం చాలా అవసరం. నేడు మన మాతృదేశం పరాధీనయై స్వాతంత్ర్యంలేకుండా, ప్రతీ విషయంలోను అన్యదేశాలపై ఆధారపడి పూర్తిగా జీవచ్ఛవంలాగ అయిపోయివుంది! అలాంటి మాతృదేశాన్ని వుద్ధరించాలీఅంటే, మళ్ళీ దీన్ని పూర్వస్థితిలోనికి తీసుకురావాలీఅంటే, ముఖ్యంగా మనం అవలంబించవలసిన సాధనాల్లో గ్రామోద్ధరణ ఒకటి! దేశానికి ఆయువుపట్టయిన గ్రామాల్ని, పల్లెటూర్లను అజ్ఞానాంధకార కూపంలోనుంచి పైకి తీసుకురావడంవల్ల అక్కడవున్న గ్రామీణులకు విద్యాజ్ఞానాభివృద్ధులు, పరిశ్రమాభివృద్ధి గలగడంతో దేశం బాగుపడుతుంది! తత్ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం తథ్యం! అంచేత గ్రామసేవాసంఘాల్ని స్థాపించి వాటివిషయమై ప్రతీ స్త్రీపురుషుడూ గూడా—ముఖ్యంగా—ప్రతీ యువతీయువకుడు తీవ్రకృషిసల్పాలి. ఇలాంటి వాటికి ఆర్థికసహాయం అత్యవసరం. ఇక్కడున్న శ్యామలరావుగారివంటి ధనికులు భూస్వాములు చేయూతనిచ్చి ప్రోత్సహిస్తే యీసంఘాలు సక్రమంగా నడుస్తాయి" అని రత్నపురి గ్రామచావిడిదగ్గర గ్రామస్థులమధ్య శ్రీమతి మాలతీదేవిగారు మృదుమధురంగా, అనర్గళవాగ్ధోరణిలో ఉపన్యసిస్తూ, ఒక్కసారి చిరునవ్వుతోనిండిన వదనంతో శ్యామలరావువైపు చూచింది! ప్రేక్షకులంతా చప్పట్లు చరిచారు.

శ్యామలరావు తనమీద ఆమెవేసిన ఆ ఒక్క చూపూ, ఆ ఒక్క ప్రశంసావాక్యమూవల్ల ఉబ్బితబ్బిబ్బైపోయాడు! ఆవిలాసపురుష పుంగవుడు యింతవరకూ యెందరో వనితామణుల—వారకాంతల—తియ్యనిచూపుల్నీ, మోహపూరితదృక్కుల్నీ ఆఖరికి వారిలపొందునుగూడా పొంది సౌఖ్యభోగాల్ని అనుభవించాడేగాని అవన్నీ యీమెయొక్క చిరునగవుతో నిండిన ఆ వొక్కచూపూ ముందూ లోకువగానే కనిపించాయి! అసలు యిలాంటి మీటింగులన్నా, యింకే యితర జాతీయకార్యాలన్నా మండిపడుతూ అవన్నీ కేవలం స్వార్థసంపాదనకోసం సృష్టింపబడుతున్నాయని చీదరించుకుంటూ దూషిస్తూవుండే ఆధనికునికి, యీ క్షణంలో యిటువంటిస్త్రీలుపన్యసించే జాతీయసభలంటే యెంతో అభిమానమూ, ఆదరణా, గలిగేయి. ఇంతకుముందు దేశసేవికలంటే అసహ్యించుకుంటూండే మహానుభావుడు, యిప్పుడు వాళ్ళను స్తుతించడం ప్రారంభించేడు. అసలు తానావేళ మీటింగుకు రావడానికి యిష్టంలేకపోయిననూ, స్నేహితుల బలవంతంమీద తప్పనిసరిగా వచ్చేడు. వచ్చినందుకు తనకు అపరిచితురాలునూ, రాష్ట్రంలో మంచిపేరు సంపాదించినను మహిళామణీఅయిన మాలతీదేవియొక్క ఒక్కచూపు తనమీద ప్రసరించడంచేత అతనికావేళ గొప్పపండుగులాగైంది! అంతేగాకుండా సభ ముగిసేవరకూ ఆమె చెప్పిన ప్రతీవాక్యాన్నీవింటూ ఆమెవైపే తృష్ణాపూరితదృక్కులతో చూస్తూవుండిపోయాడు. అప్పటికీ అతనికి తృప్తిగలగలేదు. ఏలాగైనా ఆమెతో సౌఖ్యాన్ని అనుభవించాలనే తుచ్ఛాభిలాష ఆకాముకుడికి గలిగింది. ఆ కామోద్రేకం ముందు అతనికళ్ళకు మంచి చెడ్డా గోచరంకాలేదు.

శ్యామలరావు ఆమె వుపన్యాసం ముగిసిన తర్వాత నిలబడి, తానుగూడా గ్రామోద్ధరణకోసం తన యావశ్శక్తినీ ధనాన్నీ వినియోగించి పాటుపడతాననీ, యీవుద్యమము సాఫల్యతనొందుటకు యితర ధనికులుగూడా చేయూతనివ్వాలని ప్రకటించాడు. సభికులందరూ హర్షధ్వానములు కావించారు. సభానిర్వాహకుడైన రామం వెంటనే శ్యామలరావును పూలమాలలతో గౌరవించాడు. మాలతీదేవిగూడా అతని అభిప్రాయానికి సంతసిస్తూ మళ్ళీ ఒక్కసారిలేచి యిలాగ అంది, "మంచిపేరు ప్రఖ్యాతులుగడించిన శ్యామలరావుగారు యీ వుద్యమనిర్వాహణకు పూనుకున్నందు నా ధన్యవాదాలు! వారినే యీసంఘానికి అధ్యక్షులుగాచేయ నాకోరిక" అని అంటూ చిరునగవు ముఖంతో అతనివైపు ఒకసారి చూచింది.

శ్యామలరావులో గలిగిన యీ మార్పునుజూచి గ్రామస్థులంతా యెంతో సంతోషించారు. అంత సభ ముగిసింది.

శ్రీ మాలతీదేవిగారి గౌరవార్థం, శ్యామలరావు తన భవనమందు విందు యేర్పరచాడు. విందు భుజించే సమయంలో ఆమె అతనికి ప్రస్తుత దేశపరిస్థితులన్నీ విశదముగా తెలిపింది. ప్రస్తుతం యిటువంటి గ్రామ సేవాసంఘాల్ని స్థాపించవలసిన ఆవశ్యకతను నిరూపించింది. శ్యామలరావు ఆమె చెప్పేమాటలన్నీ పైకి మాత్రం వింటూ, లోపల కామోద్రేకాన్ని పొందుతూన్నాడు. ఆమెను ప్రసన్నురాలుగా జేసుకొనేటందుకు, మీరు చెప్పిన విషయాలన్నీ అమోఘంగా వున్నాయి. యీసంఘానికి సేవజేయడానికి సిద్ధంగా వున్నాను. ఈవూళ్లోవున్న యావన్మందినీ గూడా ప్రోత్సహిస్తాను", అన్నాడు నవ్వుతూ.

ఆవేళ అందరితోబాటు తానుగూడా స్టేషను వరకూ వెళ్లి అధికాదరంతో సాగనంపాడు.

* * *

శ్యామలరావు రత్నపురవాసి. గొప్ప ధనము పలుకుబడివున్న ధనికుడు; ముప్పైయేళ్ల వయసున్న యువకుడు. తరతరాలనుంచి పెరుగుతూవస్తూన్న ఆ దానితోబాటు కీర్తినీ, భోగవిలాసాల్తో స్వేచ్ఛగా తిరుగుతూ పోగొట్టుకున్నాడు. జీవితాంతంవరకూ కొంత సుఖంగానే గడిచే ఆస్తియింకావుంది. మద్యపానానికీ, వారకాంతలకూ దాసుడు! వూళ్లో చాలామంది అతనంటే యీర్ష్యించుకుంటారేగాని పైకిమాత్రం అతన్ని చూసేసరికి సింహస్వప్నం చూసినట్టుగా వుంటుంది. రామంవంటి అతని బాల్యస్నేహితులు శ్యామలరావును మంచి మార్గంలోనికి తీసుకురావాలని విశ్వప్రయత్నాలు చేశారు. కాని లాభంలేకపోయింది.

ఆవేళ అతనికి నిద్రపట్టలేదు. ఏలాగైనా ఆమెను స్వాధీనపర్చుకోవాలని అనేక వూహలు వూహించుకొనసాగేడు. ఆఖరుకు తనకు హేయమైన జాతీయ ప్రచారకులతోటి స్నేహంచేసి తాను వాళ్లభావాల్తో యేకీభవిస్తున్నట్లు కృత్రిమంగా నటించి, తద్వారా మాలతీదేవిని మెప్పించి తన మనోరథాన్ని నెరవేర్చుకోవాలని దృఢనిశ్చయం చేసుకున్నాడు.

ఆ మర్నాటినుంచే తన వూరిలో స్థాపింపబడిన గ్రామసేవాసంఘాన్ని అభివృద్ధిలోనికి తీసుకురావడం కొరకు ప్రయత్నించసాగాడు. రామం మొదలయిన వాళ్లంతా యితని పరివర్తనకి యెంతో సంతోషిస్తూ అతనికి యింకా ప్రోత్సాహం గలుగజేస్తూన్నారు. శ్యామలరావు మటుకు కామోద్రేకంవల్ల కలిగిన వుత్సాహోద్రేకాలకొద్దీ ఈ సత్కార్యాలుచేయ ప్రారంభించనిజంగా హృదయజనితమైన సదభిలాషవలన గాదు. లోపల, హృదయంలోమటుకు కామబడబానలం రగుల్కొంటూనే వుంది.

* * *

రెండుమాసాలు గడిచాయి. శ్యామలరావు తన కోరికను వెల్లడించడానికి మాలతీదేవియొక్క నివాసస్థానానికి నాలుగైదుసార్లు వెళ్లేడు. ఆమె వాక్చాతుర్య మహిమవల్ల యేమీ లాభంలేకపోయింది మాలతీదేవి యితని గుణాన్ని సూక్ష్మంగా గ్రాహ్యపరుచుకున్నదవడంచేత యేలాగైనా యితని దుర్గుణాన్ని పోగొట్టి సద్గుణవంతునిగా, సత్ప్రవర్తకునిగా చేయాలని అనుకుంది. ఆమె చాలా నేర్పుగలది. ఎవని స్వభావం యెటువంటిదో తక్షణమే పసిగట్టగల పడతి. జాతీయ విషయాల్లోనైతేనేమి, ప్రపంచవిషయాల్లోనైతేనేమి మంచిజ్ఞాత, విదుషీమణి! సత్యాగ్రహపురోజుల్లో యీమె తన భర్తతోకలిసి చేసిన తీవ్రాందోళనా, అనుభవించిన జెయిలుజీవితమూ, పడిన యిక్కట్లు దేశీయులందరికీ తెలుసు. ఆ అసహాయోద్యమ సమయాల్లో ఆమె భర్త దేశానికీ ప్రాణాల్ని ఆహుతిచేశాడు. అప్పట్నుంచీ తాను "ఏకాకిని" అయిపోయినప్పటికీ ధైర్యాన్ని చేబట్టి తన యావజ్జీవితాన్ని జాతీయసేవకై అర్పించలాగింది. అలాంటి సాధ్వీమణిని చేజిక్కించుకోడానికి కాముకుడైన శ్యామలరావు యెన్నో యెత్తులువేస్తూ విశ్వప్రయత్నాలుచేస్తూన్నాడు. ఆమె కొరకే తన బురఖానుగూడా మార్చాడు!

అలాగే నాలుగైదుసార్లు మాలతీదేవిదగ్గరకు వెళ్లాడు. జాతీయవిషయాల్నే పైకిమాత్రం చర్చించేవాడుగాని, అతని హృదయమూ, నేత్రాలుమటుకు కామపూరితాలైవుండేవి. ఆమె అతనిగుణాన్ని కనిపెడుతూ యింకా యితోధికంగా జాతీయ, అంతర్జాతీయా విషయాల్ని తెలియపరుస్తూండేది. ఆమెయొక్క ఆభ్రాతృతుల్య ప్రేమప్రభావంచేత, శ్యామలరావు తన

మనోవాంఛను తెలియపరచాలని యెంత ప్రయత్నించినా నోటినుండి మాట వెలువడేదిగాదు; అతని ప్రతి అవయవమూ శిథిలమైపోతుండేది!

కొన్ని మాసాలు గడిచాయి. శ్యామలరావు కోరికేమి సిద్ధించలేదు. పవిత్రప్రేమముందు కృత్రిమ మోహానికి కపటస్నేహానికి యేమాత్రము తావు వుండదనడం నిజం. కాని శ్యామలరావు యీసారి యెలాగైనా మాలతీదేవిని చేబట్టాలని తుదినిశ్చయంచేసుకున్నాడు. ఓరోజున శ్యామలరావు మాలతీదేవిగారి దగ్గరకు వచ్చాడు, తన గ్రామసేవాసంఘవిషయాన్ని తెల్పాలనే మిషతో!

ఇద్దరూ కూర్చున్నారు. గ్రామోద్ధరణ విషయాన్ని చర్చిస్తూ! కొంతసేపు అలాగే సంభాషణలు జరిగాయి. శ్యామలరావుమాత్రం పైకి ఆమెతో మాట్లాడుతున్నాడన్నమాటేగాని, హృదయం కామవేదనచేత దహించుకుపోతోంది! నేత్రాలు కామతృష్ణాభరితాలైవున్నాయి. ఆమె విశదపర్చే విషయాలేవీ రుచించడంలేదు, రోగికి మందు రుచించనట్లు!

ఆమాటా, యీమాట అయినతర్వాత, మాలతీదేవి చిరునవ్వునవ్వుతూ అంది, "శ్యామలరావుగారు గ్రామోద్ధరణవిషయమై మీరింత శ్రద్ధవహిస్తున్నందుకు ధన్యవాదాలు" ఇక సంభాషణ ముగిసేటట్టు కన్పడడంచేత శ్యామలరావు తన హృదయేచ్ఛను తెలియపర్చడానికి యిదే సమయం అనుకున్నాడు. హృదయంలోంచి వస్తోన్న ఆదవేనాబాధకోర్చి వెంటనే అన్నాడు, "మాలతీదేవిగారు! నేనింత గ్రామోద్ధరణవిషయాల్లో శ్రద్ధతీసుకోడానికి అసలు కారణం మీ సౌందర్యానికి ముగ్ధతజెందే! మిమ్మల్ని అధికంగా ప్రేమిస్తున్నాను. నా కోరిక నెరవేర్చాలి!" అంటూ చేతులుచాశాడు.

మాలతీదేవి, శ్యామలరావు మాటలువిని ఆశ్చర్యపడలేదు. ఎందుకంటే, అతని స్వభావం ఆమెకు బాగా గ్రాహ్యం! అతని హృదయంలో పరివర్తనగలిగించడానికి అదే సమయం అనుకొంది! వెంటనే అతని రెండుచేతులూ పట్టుకొని చిరునవ్వుతో అంది, "కూర్చోండి, మీరింకా అజ్ఞానపశువులాగ ప్రవర్తిస్తోన్నందుకు నాకెంతైనా చింతగలుగుతోంది! నేనుగూడా మిమ్మల్ని అధికంగా ప్రేమిస్తున్నాను. కాని మీ ప్రేమలోను, నా ప్రేమలోను హస్తిమశకాంతరం తేడావుంది! అసలు మీది ప్రేమఅనిపించుకోదు. తుచ్ఛమైన మోహం! నా ప్రేమ భాతృతుల్యమైంది! మీవంటి అన్నీ తెలిసిన విద్యాధికులూ ధనికులూ యిలా ప్రవర్తిస్తూండబట్టే దేశం యిలాగ అధోగతిపాలైపోయింది! ఇకనైనా మీరు యీ స్వభావాన్ని మార్చుకుంటారని తలుస్తా!"

శ్యామలరావు నిర్విణ్ణుడైపోయాడు! ఆమె ప్రేమపూరిత ఉపన్యాసప్రభావం అతని హృదయేచ్ఛను పూర్తిగా అణగద్రొక్కింది! అతని కళ్లు తెరచుకున్నాయి! వెంటనే అన్నాడు, మాలతీదేవిగారు! క్షమించాలి, ఇక నేను మిమ్మల్ని నా సోదరీమణిలాగ తలుస్తూంటాను. నా కళ్లు తెరిచినందుకు, నా హృదయానికి దివ్యజ్యోతిని ప్రసాదించినందుకు శాశ్వత కృతజ్ఞుణ్ణి! నేనింతవరకూ చేస్తూవస్తోన్న యీ అపరాధాలకు ప్రాయశ్చిత్తంగా యిప్పట్నుంచి, నా జీవితాంతంవరకూ గ్రామోద్ధరణకై పాటుబడతాను!" అని గద్గదస్వరంతో అంటూ నమస్కరించాడు.

* * *

రోజులు గడుస్తున్నాయి! ధనికుడైన శ్యామలరావులో సత్యమైన ప్రవర్తనగలిగింది! శ్యామలరావు పూర్తిగా భోగవిలాసాల్ని త్యజించి తన సర్వస్వమూ గ్రామసేవాసంఘాలకు సమర్పించి హృదయపూర్వకంగా దేశసేవచేస్తూన్నాడనీ అంతా అనుకుంటున్నా!

